## లలితకళలు తెలుగువారి ప్రాచీన సంపద



కూచిపూడి నృత్య కళాకారులతో దైవజ్ఞశర్మ, సిరాజ్ తదితరులు

రవీంద్రభారతి, నవంబర్ 2: ప్రాచీన లలిత కళలు తెలుగువారి ప్రాచీన సంపద అని ప్రముఖ సంఖ్యాశాస్త్ర నిపుణులు దైవజ్ఞశర్మ అన్నారు. గురువారం సిరాజ్ డ్యాన్స్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని మెయిన్‌హాల్‌లో భారతీయ సకళ కళా వైభవం-2023 నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దైవజ్ఞశర్మ, డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్ జి. సూర్యతేజ, సినీ హీరోయిన్ నిషాశర్మ, గాయకురాలు నాగలక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పలువురు కూచిపూడి నాట్యకారిణులు, నాట్యగురువులకు మెమొంటోలతో పాటు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా దైవజ్ఞశర్మ మాట్లాడుతూ ప్రాచీన లలిత కళలు మన పూర్వీకులు ప్రసాదించిన సంపదని, నేటి తరం వారికి లలిత కళల పట్ల అవగాహన పెంచాల్సిన అవసరం నాట్యగురువులపై ఉందన్నారు. అంతకుముందు పలువురు నాట్యగురువులు, చిన్నారులు కూచిపూడి, భరతనాట్యం,జానపదనృత్యం, పేరిణి నృత్యాలు ప్రదర్శించి వీక్షకులను మంత్రముగ్ధులను చేశారు. కార్యక్రమంలో సిరాజ్ డ్యాన్స్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు సిరాజ్ మాస్టర్, భాగ్యలక్ష్మి, దివ్యారెడ్డి, మృణాళిని, సరస్వతిరాజ్, వైష్ణవి, ఆర్. నవీన్, యశ్వంత్, నాట్యగురువులు పాల్గొన్నారు.

## సైఫాబాద్ పీజీ సైన్స్ కళాశాలలో లేడీస్ హాస్టల్ ప్రారంభం



సైఫాబాద్ పీజీ సైన్స్ కళాశాల ఆవరణలో లేడీస్ హాస్టల్‌ను గురువారం ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జె లక్ష్మణ్‌నాయక్ ప్రారంభించారు. సుమారు 200 మంది విద్యార్థినులకు హాస్టల్ వసతి కల్పిస్తున్నట్లు ఆయన చెప్పారు. దాంతో ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న పీజీ విద్యార్థినుల కల ఎట్టకేలకు నెరవేరింది. విద్యార్థినులు ఆనందం వ్యక్తం చేశారు.

– సుల్తాన్‌బజార్, నవంబర్ 2

## బాణాసంచా వ్యాపారులు నిబంధనలు పాటించాలి

సుల్తాన్‌బజార్,నవంబర్ 2. బాణాసంచా వ్యాపారులు నిబంధనలను పాటించాలని,లేకపోతే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటా మని అఫ్జల్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ సంతోషం హెచ్చరించారు. గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టపాసులు విక్రయించే వ్యాపారులు అగ్నిమాపక,ట్రాఫిక్, జీహెచ్ఎంసీ తదితర విభాగాలతో పాటు పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు.ని బంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని వారికి సూచించారు.

## 'కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పాలి'

రవీంద్రభారతి, నవంబర్ 2: ఓబీసీ కులగణన చేపడతామని రాహుల్ గాంధీ ఓటుబ్యాంకు రాజకీయాలకు పాల్పడుతున్నాడని ఓబీసీ సెంట్రల్ కమిటీ మహిళా జాతీయ అధ్యక్షురాలు యం.భాగ్యలక్ష్మి విమర్శించారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ.. 75 సంవత్సరాలు పరిపాలించిన కాంగ్రెస్ పార్టీ మహిళా బిల్లును ప్రవేశపెట్టకుండా ఓటుబ్యాంకు రాజకీయాలకు పాల్పడ్డారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధినేత రాహులగాంధీ తెలంగాణలో ఏం ముఖం పెట్టుకొని బీసీలను ఓట్లు అడుగుతాడని ఆమె విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ కల్లబొల్లి మాటలను బీసీలు నమ్మరని, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని ఆమె ప్రజలకు పిలుపునిచ్చారు. సమావేశంలో యు. చిన్నయ్యముదిరాజ్, మహేశ్‌గౌడ్, మల్లేశ్‌యాదవ్, వెంకట్‌యాదవ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

- 13న నామినేషన్ల పరిశీలన
- 15 వరకు ఉపసంహరణ

అబిడ్స్, నవంబర్ 2: అసెంబ్లీ ఎన్నికలలో భాగంగా శుక్రవారం నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. నామినేషన్‌ల స్వీకరణకు రిటర్నింగ్ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం నుంచి 10 వరకు నామినేషన్‌ల స్వీకరణ ఉంటుంది. గోషామహల్ నియోజకవర్గంలో నామినేషన్లకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రిటర్నింగ్ అధికారి వి విక్టర్ గురువారం విలేకరులకు తెలిపారు. అబిడ్స్‌లోని జీహెచ్ఎంసీ పద్మాల్గవ సర్కిల్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో శుక్రవారం నుంచి నామినేషన్‌ల స్వీకరణ జరుగుతుంది. 5వ తేదీ ఆదివారం సెలవు కావడంతో ఆ రోజు నామినేషన్ల స్వీకరణ ఉండదని ఆర్వో పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందన్నారు. 13న దాఖలైన నామినేషన్ల పరిశీలన, 15 లోపు ఉప సంహరణ ముగుస్తుందని, అనంతరం అభ్యర్థుల తుది జాబితాను విడుదల చేయనున్నట్లు ఆయన చెప్పారు.

**డీఆర్‌సీ కేంద్రంగా కోఠి మహిళా విశ్వవిద్యాలయం**

ఎన్నికల నేపథ్యంలో డీఆర్‌సీ కేంద్రంగా కోఠి మహిళా విశ్వ విద్యాలయాన్ని ఎంపిక చేశారు. కళాశాలలో స్ట్రాంగ్ రూంలో ఈవీఎంలను భద్రపరుస్తారు. గోషామహల్ నియోజకవర్గానికి చెందిన 235 పోలింగ్ కేంద్రాలకు అవసరమయ్యే ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లను ప్రిసైడింగ్ అధికారులకు నవంబర్ 29న అందజేయనున్నారు.

**అధికారులకు శిక్షణ**

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో భాగంగా కోఠిలోని తెలంగాణ మహిళా విశ్వ విద్యాలయంలో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు గురువారం ఈవీఎంలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గోషామహల్ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి విక్టర్ పర్యవేక్షణలో జరిగిన ఈ శిక్షణ కార్యక్రమంలో ఏఆర్ఓలు ప్రేమ్‌కుమార్, సయ్యద్ సయీదుద్దీన్, విద్యాసాగర్, శైలజ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్యే తనయుడికి సన్మానం



జితేందర్‌సింగ్‌ను సన్మానించిన బీఆర్ఎస్ గోషామహల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్

అబిడ్స్, నవంబర్ 2: ముఖ్యమంత్రి కేసీఆర్ చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్శితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని ఆ పార్టీ గోషామహల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నందకిషోర్ వ్యాస్ బిలాల్ అన్నారు. ఇటీవల తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీలో చేరిన మాజీ ఎమ్మెల్యే శివలాల్ సింగ్ తనయుడు జితేందర్ సింగ్‌ను ధూల్‌పేట్‌లోని ఆయన నివాసంలో కలిసి సన్మానించారు. అనంతరం నందకిషోర్ వ్యాస్ బిలాల్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని వర్గాల వారికి సమ ప్రాధాన్యం కల్పిస్తూ అభివృద్ధి, సంక్షేమ పథకాలను చేపట్టారని వివరించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ అత్యధిక స్థానాలను కైవసం చేసుకుని హ్యాట్రిక్ సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే శివలాల్ సింగ్ తనయుడు జితేందర్ సింగ్ కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరడం సంతోషకరమన్నారు. సంక్షేమ పథకాలను ఇంటింటా ప్రచారం చేసి ప్రజల సహకారంతో విజయం సాధిస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఆనంద్‌సింగ్, బల్‌దీప్ సింగ్, శ్రీనివాస్ గౌడ్, శంకర్‌సింగ్ జమ్మేదార్, దినేశ్‌సింగ్ పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించాల్సిందే

- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



మొఘల్‌పుర స్పోర్ట్ కాంప్లెక్స్‌లో అధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

చార్మినార్, నవంబర్ 2: శాసనసభ ఎన్నికల నిర్వహణలో నిర్లక్ష్యం ఏ స్థాయిలో కనిపించినా కఠిన చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సంబంధిత అధికారులను హెచ్చరించారు. గురువారం చార్మినార్ నియోజకవర్గ ఆర్ఓ, నోడల్ అధికారులతో పాటు ఎన్నికల సిబ్బందితో కలిసి మొఘల్‌పుర స్పోర్ట్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన ఆర్ఓ కార్యాలయంలో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. శాసనసభ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నామినేషన్ ప్రక్రియలోనూ అన్ని పత్రాలను పరిశీలించి.. వాటిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు.ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామని చార్మినార్ నియోజకవర్గ నోడల్ అధికారి, చార్మినార్ ఏసీపీ రుద్రభాస్కర్ తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాల్లో భద్రతపై కలెక్టర్‌కు వివరించారు. దొంగ ఓట్ల నివారణకు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. సమావేశంలో ఆర్ఓ వెంకన్న, చార్మినార్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

- మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌పై ప్రత్యేక దృష్టి
- గోషామహల్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.విక్టర్‌తో ముఖాముఖి



వి.విక్టర్, గోషామహల్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి

అబిడ్స్, నవంబర్ 2: గోషామహల్ నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేదుకు పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.విక్టర్ తెలిపారు. నియోజకవర్గంలో 235 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ఎన్నికలను పురస్కరించుకుని పీఓ, ఏపీఓలకు ఈవీఎం, వీవీ ప్యాట్‌లపై శిక్షణా కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. అంతే కాకుండా ఎన్నికల సందర్భంగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘన జరగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రచారం చేసే రాజకీయ పార్టీలు 48 గంటల ముందు అనుమతి తీసుకోవాలని పేర్కొన్నారు. నవంబర్ 30న జరిగే ఎన్నికలకు నియోజకవర్గంలో ఎన్నికల కమిషన్ నిబంధనలకనుగుణంగా ఓటర్ స్లిప్పు తరలింపు, పంపిణీ, మద్యం రవాణా, పంపిణీపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎన్నికల నిర్వహణపై ఆయనతో 'నమస్తే తెలంగాణ' ముఖాముఖి సంభాషించింది. ఆ వివరాలు..

**నమస్తే తెలంగాణ : ఎన్నికలలో పోలింగ్ శాతం పెంచేందుకు ఏ విధమైన చర్యలు తీసుకుంటున్నారు?**

రిటర్నింగ్ అధికారి : ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం, కళాశాలలలో సమావేశాలను నిర్వహించి ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రచారాన్ని చేపడుతున్నాం. పాఠశాల విద్యార్థుల ద్వారా వారి తల్లిదండ్రులకు అప్పీల్ పంపించాము. అదే విధంగా బస్తీలు, కాలనీల్లో ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లపై ప్రజలకు అవగాహన పెంపొందించి ఓటింగ్ శాతం పెరిగేలా పాటుపడుతున్నాం.

**నమస్తే తెలంగాణ : ఎన్నికల గురించి అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాలు నిర్వహించారా?**

రిటర్నింగ్ అధికారి : ఎన్నికల సందర్భంగా అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాలను నిర్వహించి ఎన్నికల అంశాలపై అవగాహన కల్పించాము. నామినేషన్లు, ప్రచారం, ప్రచారానికి అనుమతులు తీసుకోవాల్సిన విధానం, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, ఎన్నికలలో ఖర్చు తదితర అంశాలపై పూర్తి అవగాహన కల్పించాం.

**నమస్తే తెలంగాణ : ఎన్నికల సందర్భంగా ఏ విధమైన నిఘా ఏర్పాటు చేశారు?**

రిటర్నింగ్ అధికారి : ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వేలెన్స్, వీడియో సర్వేలెన్స్, వీడియో వీవింగ్ టీమ్‌లతో పాటు నోడల్ అధికారి పర్యవేక్షణలో తనిఖీలు చేపడుతున్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘనలు చోటు చేసుకోకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం. స్టాటిక్ సర్వేలెన్స్ టీమ్ తనిఖీలలో భాగంగా ఇప్పటికే పెద్ద ఎత్తున నగదును స్వాధీనం చేసుకున్నాం.

**నమస్తే తెలంగాణ : దివ్యాంగ ఓటర్ల కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?**

రిటర్నింగ్ అధికారి : దివ్యాంగ ఓటర్ల కోసం పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపుల ఏర్పాటుతో పాటు వీల్‌చైర్లను అందుబాటులో ఉంచుతున్నాం. నియోజకవర్గంలో ఇప్పటివరకు 941 దివ్యాంగులను గుర్తించాము. వారి చిరునామాలను సేకరించి 12డీ ఫారాలను అందజేసి పోస్టల్ బ్యాలట్ వేసేందుకు సమ్మతి తీసుకుంటున్నాం.

**నమస్తే తెలంగాణ : ఎన్నికల సామగ్రి పంపిణీ, ఈవీఎంల భద్రపర్చేందుకు ఏ ప్రాంతాన్ని ఎంపిక చేశారు?**

రిటర్నింగ్ అధికారి : గోషామహల్ నియోజకవర్గంలో 235 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు నిర్వహించనున్నాం. ఈవీఎంలను కోఠిలోని తెలంగాణ మహిళా విశ్వ విద్యాలయాన్ని డీఆర్‌సీ కేంద్రంగా ఎంపిక చేశాం. అక్కడ నుంచే పోలింగ్ సామగ్రిని పంపిణీ చేయడంతో పాటు ఓట్ల లెక్కింపు కూడా అక్కడే చేపట్టనున్నాము.